

కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదల

» ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరు స్థానాలకు అభ్యర్థులు ప్రకటన

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేయబోయే అభ్యర్థుల తొలి జాబితాను అధిష్ఠానం మంగళవారం మధ్యాహ్నం విడుదల చేసింది. ఈ జాబితాలో ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన ఆరు స్థానాలు ... మిగతా 8వ పేజీలో


గంగాధర్


తాతారావు

అడుగు పడని ప్రగతి

అనకాపల్లి జిల్లా ఏర్పడి రెండేళ్లు

- » ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనానికి ఇప్పటికీ లభించని మోక్షం
- » ఉద్యోగుల కేటాయింపులతో సరిపెట్టేసిన ప్రభుత్వం
- » అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న కార్యాలయాలు
- » రాకపోకలకూ ఉద్యోగులకు తప్పని వెతలు

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి... జిల్లాగా ఆవిర్భవించి నేటితో సరిగ్గా రెండేళ్లు. కానీ అభివృద్ధిలో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనా సౌలభ్యం పేరుతో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాను మూడుగా విభజించింది. దీంతో అనకాపల్లి జిల్లా ఏర్పాటయింది. అట్టహాసంగా కొత్తగా జిల్లాలను ఏర్పాటు చేసినా, మౌలిక వసతుల కల్పనకు కనీస నిధులు విడుదల చేయకపోవడంతో అరకొర వసతుల మధ్య కార్యాలయాల్లో పనులు సా...గుతున్నాయి.


అద్దె భవనంలో అనకాపల్లి జిల్లా కలెక్టరు కార్యాలయం

జిల్లాలోని ప్రభుత్వ శాఖల కార్యాలయాలకు ఇప్పటి వరకు పరిపాలన భవనాలు సమకూర్చలేదు. అంతేకాకుండా ఉద్యోగులకు కనీస వసతులు కల్పించకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాగా పేరు మార్చి, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సర్దుబాటుతో ప్రభుత్వం చేతులు దులుపు కోవడంపై విమర్శలు రేగుతున్నాయి.

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి 2022 ఏప్రిల్ 3న అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో కలెక్టరేట్, పోలీసు హెడ్‌క్వార్టర్స్‌తో పాటు వివిధ శాఖలకు చెందిన కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆదిలో సొంత భవనాలు లేక, అద్దె భవనాలు దొరకక ఇబ్బందులు ఎదురయ్యాయి. అయితే రెండేళ్లు గడిచినా పరిస్థితిలో మార్పు కనిపించలేదు. కలెక్టరేట్ భవన నిర్మాణానికి నేటికీ పునాదులు పడలేదు. శంకరంలోని ఓ ప్రైవేటు భవనంలోనే కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాలు నడుస్తున్నాయి. అనకాపల్లి కేంద్రంగా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ (వివిధ కార్యాలయాల సముదాయం) నిర్మాణానికి పది ఎకరాల స్థలాన్ని సేకరించడానికి అధికారులు ఏడాదిన్నరకుపైగా సమయం తీసుకున్నా, ఇంకా కొలిక్కిరాలేదు. ఎట్టకేలకు అనకాపల్లి మండలం కోడూరులో స్థలాన్ని సేకరించి కలెక్టరేట్ నిర్మాణానికి కోసం కేటాయిస్తున్నట్లు ప్రభుత్వానికి నివేదిక పంపినా నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదు.


ఒక ప్రైవేటు షాపింగ్ కాంప్లెక్స్ పైఅంతస్తులో జిల్లా ఖజానా కార్యాలయం

విశాఖ నుంచే బాధ్యతలు

అనకాపల్లి జిల్లా ఏర్పడిన తరువాత సుమారు 45 రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇక్కడికి తరలించారు. ఉద్యోగుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేసి, రెండేళ్లు కావస్తున్నా నేటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల అధికారులు విశాఖపట్నం నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నారు. ప్రధానంగా జలవనరుల శాఖ, రోడ్లు, భవనాలు, ఏపీఈపీడీసీఎల్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జాతీయ రహదారుల శాఖల కార్యాలయాలు జిల్లా కేంద్రానికి రాలేదు. జిల్లా అధికారులుగా హోదా కల్పించి కొంతమంది సిబ్బందిని కేటాయించి నడిపిస్తున్నారు.

ఒక్క సొంత భవనమూ లేదు

జిల్లా ఏర్పడి రెండేళ్లైనా ప్రభుత్వ కార్యాలయాల కోసం కనీసం ఒక్క భవనాన్ని కూడా నిర్మించలేదు. దీంతో వివిధ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం చదరపు అడుగుకు రూ.10 చొప్పున అద్దె చెల్లించాల్సి వస్తోంది. కాగా పట్టు పరిశ్రమ, బీసీ సంక్షేమశాఖ, జిల్లా ఖజానా అధికారి, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో, తూనికలు కొలతల శాఖల కార్యాలయాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలిసే పరిస్థితి లేదు. బీసీ సంక్షేమ శాఖ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జిల్లా కార్యాలయాలు అద్దె చెల్లించలేని స్థితిలో సెల్లార్లలోనే నడుపుతున్నారు.

ఉద్యోగులకూ తప్పని వెతలు...

కలెక్టర్, జిల్లా పోలీసు కార్యాలయాలు అనకాపల్లి పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని శంకరం గ్రామంలో ఏర్పాటు చేశారు. కనీసం ఆటోలు కూడా నడవకపోవడంతో ఉద్యోగుల రాకపోకలకు రెండేళ్లుగా అవస్థలు పడుతున్నారు. ప్రత్యేకంగా ఉద్యోగుల కోసం బస్సు సదుపాయం కల్పిస్తామని ప్రకటించిన అధికారులు పట్టించుకోలేదు. దీనికి తోడు అనకాపల్లి పట్టణంలో అద్దెకు ఇళ్లు లభించకపోవడం, రూ. వేలల్లో అడ్వాన్సులు డిమాండ్ చేస్తుండడంతో బెంబేలెత్తిపోతున్నారు. చేసేది లేక కొంతమంది విశాఖ నుంచే రాకపోకలు సాగిస్తున్నారు.

కాగా జిల్లా ఏర్పడక ముందు ఆయా కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండేవారని, ప్రస్తుతం జిల్లా ఉన్నతాధికారులు నిత్యం కలెక్టరేట్‌లో రివ్యూ మీటింగుల పేరుతో కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. దీంతో వివిధ పనులపై జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అయితే అధికారులు మాత్రం కొత్త జిల్లాలో కార్యాలయాల ఏర్పాట్లు, సిబ్బంది సర్దుబాట్లు ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్నాయని, త్వరలోనే అభివృద్ధి దిశగా నడిపిస్తామంటున్నారు.

ముసుగు తొలగింది



ఎన్నికల్లో వైసీపీ తరపున పనిచేసేందుకు సిద్ధమైన పలువురు వలంటీర్లు

- » మూకుమ్మడిగా రాజీనామాలు
- » అధికారుల కంటే ముందు అధికార పార్టీ నేతల ఎదుట రాజీనామా లేఖల ప్రదర్శన
- » జగన్ రుణం తీర్చుకుంటామని నినాదాలు
- » నెలకు రూ.15 వేలు ఇస్తామంటూ నేతల ఆఫర్
- » అధికారంలోకి వస్తే మళ్లీ తీసుకుంటామని హామీ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు సమీపించేసరికి గ్రామ, వార్డు వలంటీర్లు రాజకీయ ముసుగు తొలగించి, అసలు స్వరూపం బయటపెడుతున్నారు. పింఛన్ల పంపిణీకి దూరంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం చెప్పడంతో స్థానిక రాజకీయ నేతల ఒత్తిళ్లలో మూకుమ్మడిగా ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో పెందుర్తి మండలంలో 30 మంది, పరవాడ మండలం తానాంలో 23 మంది రాజీనామా చేశారు. అలాగే అనకాపల్లి జిల్లా కశింకోట పంచాయతీలో అయితే ఏకంగా 89 మంది వలంటీర్లు రాజీనామాలు సమర్పించారు. అదే మండలం బయ్యవరంలో మరో 14 మంది రాజీనామా చేశారు. వీటి వెనుక వైసీపీ నేతల ప్రోద్బలం ఉందనేది సుస్పష్టం. తానాంలో రాజీనామా చేసిన వలంటీర్లు అక్కడి జెడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిశారు. తమ రాజీనామా పత్రాలను ప్రదర్శిస్తూ 'జై జగన్...జైజై అదీప్ రాజు...' అంటూ నినాదాలు చేశారు. జగన్ రుణం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ కూడా చేయించారు.

ఇన్నాళ్లూ వలంటీర్లు స్వచ్ఛంద సేవకులని వైసీపీ పెద్దలు చెప్పుకొచ్చారు. కేవలం రూ.5 వేల గౌరవ వేతనానికే పనిచేస్తున్నారని వారిని ప్రశంసించారు. కానీ పార్టీ కోసం పనిచేసేలా వారికి శిక్షణ ఇచ్చారు. వారి ద్వారానే గ్రామాలు, వార్డుల్లో ఓటర్ల వివరాలు తీసుకోవడం, ఓటర్లకు కానుకలు పంపిణీ చేయడం చేశారు. నగరంలో కార్పొరేటర్లు, గ్రామాల్లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు వారిని (వలంటీర్లను) పార్టీ క్రియాశీలక కార్యకర్తల్లా భావిస్తున్నారు.

ప్రస్తుతం ఎన్నికల సంఘం ఆంక్షలు విధించిన నేపథ్యంలో నాయకులు ఎక్కడికక్కడే సమావేశాలు నిర్వహించి, వలంటీరు పోస్టుకు రాజీనామాలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తున్నారు. అలా చేస్తే నెలకు రూ.15 వేలు వరకు ఇస్తామని ఆశ చూపుతున్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే అందరినీ వలంటీర్లుగా తీసుకుంటామని భరోసా ఇస్తున్నారు. ఈ మూడు నెలలు పార్టీకి పనిచేయాలని, ఏ అధికారి ఏమీ అనకుండా తాము చూసుకుంటామని హామీ ఇచ్చారు. తమ చేతులు మీదుగానే నియమించిన వలంటీర్లను ఆయా నాయకులు రెండు రోజుల నుంచి ఇళ్లకు పిలిచి మూకుమ్మడిగా రాజీనామాలు చేయిస్తున్నారు. ఇది గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా ఉంది. రాజీనామాకు కారణం ఏమి రాశారు? అనే విషయాన్ని అధికారులు వెల్లడించడం లేదు. అధికార పార్టీకి భయపడి ఆ పత్రాలను బయటపెట్టడం లేదు. పోస్టులకు రాజీనామా చేసినవారు ఎన్నికల ... మిగతా 8వ పేజీలో

వలంటీర్ల రాజీ డ్రామా!

తొలుత ఎమ్మెల్యే, జడ్పీటీసీ సభ్యుల సమక్షంలో లేఖల ప్రదర్శన

- » రాజీనామా లేఖల్లో జగన్ రుణం తీర్చుకుంటామని ప్రస్తావన
- » ఎంపీడీవోకు సమర్పించకముందే వైసీపీకి అనుకూలంగా నినాదాలు
- » నిబంధనలకు వ్యతిరేకమంటున్న నిపుణులు


ఎమ్మెల్యే, జడ్పీటీసీల సమక్షంలో సోమవారం రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

పరవాడ, ఏప్రిల్ 2: ఎన్నికల నిబంధనలు కఠినతరం కావడంతో వైసీపీ అనుకూల వలంటీర్లు రాజీనామా డ్రామాలు ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తానాం గ్రామానికి చెందిన 23 మంది వలంటీర్లు ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేసేందుకు వీలుగా రాజీనామా చేశారు. ఈ వ్యవహారంలో ఓ వైసీపీ నేత కీలకపాత్ర పోషించినట్టు సమాచారం. అయితే వీరంతా తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేసిన తర్వాతే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉంటుంది. అయితే తానాం గ్రామానికి చెందిన 23 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేయకుండానే సోమవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు సమక్షంలో ప్రదర్శించారు. అంతేకాకుండా 'జై జగన్...అదీప్‌రాజ్ నాయకత్వం వర్ధిల్లాలంటూ' నినాదాలు చేశారు. దీంతో పాటు జగన్ రుణం తీర్చుకుంటామని రాజీనామా పత్రాల్లో రాయడం ... మిగతా 8వ పేజీలో

పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం!

సచివాలయాల సిబ్బందితో అందజేత

- » నాలుగు కేటగిరీల లబ్ధిదారులకు ఇంటివద్దే పంపిణీ
- » నేటి మధ్యాహ్నం నుంచి ఆరో తేదీ వరకు ప్రక్రియ
- » ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా అధికారులు

(అనకాపల్లి, ఆంధ్రజ్యోతి)



సామాజిక పింఛన్ల పంపిణీపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది... ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వలంటీర్ల ద్వారా పింఛన్ల ప్రక్రియకు ఎన్నికల సంఘం బ్రేక్ వేసింది. ఈ నేపథ్యంలో పంపిణీకి మార్గదర్శకాలను జారీ చేసింది. బుధవారం మధ్యాహ్నం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించి ఈనెల ఆరో తేదీలోగా పూర్తి చేయాలని నిర్దేశించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

అధికారుల గణాంకాల ప్రకారం జిల్లాలో ప్రతినెలా 2.65 లక్షల మందికి 14 రకాల పింఛన్లు అందిస్తున్నారు. ఇందుకోసం నెలకు రూ.7.7 కోట్లు కేటాయిస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించిన నేపథ్యంలో నాలుగు కేటగిరీలకు చెందిన పింఛన్‌దారులకు మాత్రమే ఇంటివద్దకు వెళ్లి గ్రామ సచివాలయాల సిబ్బంది పింఛన్లు అందజేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన కేటగిరీలకు చెందిన వారంతా గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి పింఛను తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో 48,800 మందికి సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి పింఛన్ అందించనున్నారు. వీరిలో కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు 31 వేలమంది, తీవ్ర అనారోగ్య సమస్యలతో మంచాన ఉన్నవారు 1,800 మంది, వీల్‌చైర్స్ ఆధారంగా జీవిస్తున్నవారు రెండు వేల మంది, సైనిక్ వెల్ఫేర్ కింద వితంతువులు 14 వేల మంది ఉన్నారు. కాగా జిల్లాలోని 9,136 మంది వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం జిల్లాలో 522 వార్డు, గ్రామ సచివాలయాల పరిధిలో 650 మంది మాత్రమే సిబ్బంది పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి సచివాలయాలు ఉదయం 7 గంటలనుంచి రాత్రి 9 గంటల వరకు తెరచి ఉంచాలని అధికారులు ఆదేశించారు. సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకొనే లబ్ధిదారులు ఆధార్‌కార్డు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

అందరికీ పింఛన్లు అందిస్తాం

సామాజిక పింఛన్‌లు అందరికీ అందించేలా ఏర్పాట్లు చేశామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. బుధవారం మధ్యాహ్నానికి బ్యాంకులో నగదు జమవుతుందని, జిల్లాలో అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది ద్వారా ఈనెల ఆరో తేదీ వరకు పింఛన్‌లు అందిస్తామని స్పష్టం చేశారు.

5న పవన్‌కల్యాణ్ పర్యటన

అనకాపల్లిలో వారాహి విజయయాత్ర

- » మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభం
- » సాయంత్రం నెహ్రూచౌక్ కూడలిలో బహిరంగ సభ
- » మూడు పార్టీల నేతల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు



కొత్తూరు, ఏప్రిల్ 2: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఈనెల ఐదో తేదీన అనకాపల్లిలో పర్యటించనున్నారు. ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ తెలిపారు. ఉత్తరాంధ్ర పర్యటనలో భాగంగా ఈ నెల 4న నెల్లిమర్ల, 5న అనకాపల్లి, 6న ఎలమంచిలి, 7న పెందుర్తి నియోజకవర్గాల్లో పవన్ కల్యాణ్ వారాహి విజయభేరి యాత్రను నిర్వహించడంతో పాటు పలు బహిరంగ సభల్లో పాల్గొనున్నారు. ఇందులో భాగంగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. పర్యటనలో భాగంగా ఐదో తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు పవన్ కల్యాణ్ వారాహి యాత్ర అనకాపల్లి సుంకరమెట్ట కూడలి వద్ద ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి మెయిన్ రోడ్డు గుండా సాగి నెహ్రూచౌక్ కూడలికి చేరుకుంటుంది. సాయంత్రం అక్కడ భారీ బహిరంగ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి కూటమిలోని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్, ప్రభాస్, రామ్‌చరణ్, చిరంజీవి అభిమానులు, కార్మిక, కర్షక, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కొణతాల కోరారు.

నర్సీపట్నంలో ఉద్రిక్తత

వెంకునాయుడుపేటలో వలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశం

- » ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు
- » వలంటీర్లను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయింపు
- » 15 మంది వలంటీర్లపై కేసు నమోదు


టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

నర్సీపట్నం, ఏప్రిల్ 2:

ఎన్నికల నిబంధనలకు వైసీపీ నేతలు అడుగడుగునా గండి కొడుతున్నారు. వలంటీర్లపై ఈసీ స్పష్టమైన ఆదేశాలిచ్చినా వారితో సమావేశాలు నిర్వహించడం, ప్రచారం చేయిస్తున్నారు. ఈ క్రమంలో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ మంగళవారం వలంటీర్లతో సమావేశం కావడం ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి.

నర్సీపట్నం మునిసిపాలిటీ 22వ వార్డు వెంకునాయుడుపేటలోని ఓ వైసీపీ నాయకుడి ఇంట్లో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేశ్ మంగళవారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. దీంతో టీడీపీ నాయకులు జిల్లా ఎన్నికల అధికారికి, నర్సీపట్నం రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా వైసీపీ నేత ఇంటి వద్దకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. వలంటీర్లను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కొంతమంది వలంటీర్లు గోడదూకి పారిపోయారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అర్బన్ నోడల్ అధికారి, మునిసిపల్ కమిషనర్ పూడి రవిబాబులు వైసీపీ నాయకుడి ఇంట్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం జరిగింది. డీఎస్పీ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకొని టీడీపీ నాయకుడు పెదిరెడ్ల చింతు, గవిరెడ్డి వెంకటరమణల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉండగా వలంటీర్లతో సమావేశం నిర్వహించారని వారు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సమావేశానికి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ హాజరయ్యారని, తమను చూసి కారులో వెళ్లి పోయారని టీడీపీ నేతలు తెలిపారు. దీంతో తప్పు జరిగితే ఎలక్షన్ కమిషన్ చర్యలు తీసుకుంటుందని, రోడ్డు ఖాళీ చేయాలని డీఎస్పీ కోరారు. వైసీపీ నాయకుడి ఇంట్లో ఉన్న మునిసిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, ఇతర నాయకులు, కార్యకర్తలను డీఎస్పీ ... మిగతా 8వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.14
సహరి (గురు)	4.36

పంత్ X శ్రేయాస్

నేడు ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య మ్యాచ్

- » వరుస విజయాల ఊపుమీదున్న కోల్‌కతా
- » సీఎస్‌కేపై సాధించిన విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో ఆత్మవిశ్వాసం
- » ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి


నెట్ ప్రాక్టీస్‌లో శ్రేయాస్ అయ్యర్, రిషబ్ పంత్

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఏప్రిల్ 2: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బుధవారం జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు తలపడనున్నాయి. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లకు ఏసీఏ-వీడీసీఏ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్..ఆదివారం ఇక్కడ బలమైన చెన్నై సూపర్ కింగ్స్‌ను ఓడించింది. ఢిల్లీ క్యాపిటల్స్ జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో, ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓటమి పాలైనా, హోమ్ గ్రౌండ్‌లో సీఎస్‌కేపై విజయం సాధించడంతో ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. జట్టులో టాప్ ఆర్డర్ డేవిడ్ వార్నర్, పృథ్వీషా, కెప్టెన్ రిషబ్ పంత్, మిచెల్ మార్ష్ ఫామ్‌లో ఉన్నారు. ఇప్పటికే వరుసగా రెండు విజయాలతో జోరు మీద ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్‌పై కూడా విజయం సాధించాలని ఢిల్లీ క్యాపిటల్స్ భావిస్తోంది.

మరోవైపు బలమైన రాయల్ చాలెంజర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లపై వరుస విజయాలు సాధించి మంచి ఊపు మీదున్న కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) బుధవారం జరిగే ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరాలనే లక్ష్యంతో ఉంది. కేకేఆర్ జట్టులో ఆల్‌రౌండర్ ఆండ్రి రసూల్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అలాగే ఓపెనర్ ఫిల్ సాల్ట్‌తోపాటు సునీల్ నరైన్, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్, వెంకటేష్ అయ్యర్, రణదీప్‌సింగ్, రింకు సింగ్‌తో బ్యాటింగ్ ఆర్డర్ పటిష్ఠంగా ఉంది. కాగా ఈ సీజన్‌లో అత్యధిక పారితోషకం (రూ.24.75 కోట్లు) అందుకుంటున్న ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ అదనపు బలం. అయితే ఇప్పటివరకూ రెండు మ్యాచ్‌లలో మిచెల్ స్టార్క్ ఒక వికెట్ కూడా పడగొట్టలేదు. ఏదేమైనా సీఎస్‌కేపై సాధించిన విజయం, హోమ్ గ్రౌండ్‌లో ఆడనుండడం ఢిల్లీ క్యాపిటల్స్‌కు, వరుస విజయాలు, ఆల్‌రౌండర్ రసూల్ ఫామ్‌లో ఉండడం కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కలిసివచ్చే అంశాలని చెప్పవచ్చు. ఢిల్లీ క్యాపిటల్స్‌కు రిషబ్ పంత్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు శ్రేయాస్ అయ్యర్ నాయకత్వం వహిస్తున్నారు. మ్యాచ్ బుధవారం రాత్రి 7.30 గంటల నుంచి ప్రారంభం కానున్నది. అందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. కాగా ఇరుజట్ల ఆటగాళ్లు మంగళవారం సాయంత్రం ముమ్మర సాధన చేశారు.

క్రైం... crime news

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం

గొలుగొండ, ఏప్రిల్ 2 : తాండవ రిజర్వాయర్‌లో ప్రమాదవశాత్తూ బోటు బోల్తా పడడంతో గల్లంతైన మత్యకారుడు గరగల అప్పారావు మృతదేహం మంగళవారం లభించింది.రిజర్వాయర్‌లో రెండు రోజుల క్రితం సాలికమల్లవరం పంచాయతీ శివారు పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన అప్పారావు, మరో వ్యక్తి రొయ్యల వేట సాగిస్తుండగా ప్రమాదవశాత్తూ బోటు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో అప్పారావు రిజర్వాయర్‌లో పడి గల్లంతు కాగా, మరో వ్యక్తిని స్థానికులు రక్షించారు. అప్పారావు మృతదేహం కోసం రెండు రోజులుగా ఎస్‌ఐ కృష్ణారావు, నర్సీపట్నం రూరల్ సీఐ హరి, రెవెన్యూ అధికారులు ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రిజర్వాయర్ మధ్యలో మృతదేహాన్ని మత్స్యకారులు గుర్తించి, రిజర్వాయర్ ఒడ్డుకు చేర్చారు.రిజర్వాయర్ వద్ద పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి

లంకెలపాలెం, ఏప్రిల్ 2: ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. మంత్రిపాలెం జెఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయానికి సమీపంలో మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకొంది. పరవాడ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాదీబ్ (52) స్థానిక జెఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయంలో నివాసం ఉంటూ ఫార్మాసిటీలో పనిచేస్తున్నాడు. విధులకు వెళ్లేందుకు నడుచుకొని ప్రధాన రహదారి దాటుతుండగా కన్నూరు నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి బలంగా ఢీకొన్నాడు. దీంతో సాదీబ్ తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ బాలసూర్యారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- అవయవాలు దానం చేసిన కుటుంబీకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 2 : మండలంలోని పులపర్తి జంక్షన్ సమీపంలో హైవేపై గత నెల 29న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విశాఖలోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కేఎస్‌వీ కృష్ణ మంగళవారం మృతి చెందినట్టు రూరల్ ఎస్సై సింహాచలం తెలిపారు. జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రమాదానికి గురయ్యారు. ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన ఇద్దరినీ అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ కృష్ణ చికిత్స పొందుతూ మృతి చెందారు. అతను విశాఖలోని వైభవ్ జ్యూయలర్స్ ప్రధాన బ్రాంచిలో పనిచేస్తుంటారని ఎస్సై తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన కృష్ణ బంధువులు విశాఖలో అవయదానం చేసేందుకు ముందుకు వచ్చినట్టు చెప్పారు.

ఆటో, బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

నక్కపల్లి, ఏప్రిల్ 2: స్థానిక వారపు సంత సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఆటో, బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నక్కపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం సచివాలయం సెక్రటరీగా పనిచేస్తున్న కర్రి శ్రీను బైక్‌పై నక్కపల్లి నుంచి అడ్డరోడ్డు వైపు వెళుతుండగా ఆగి వున్న ఆటోను ఢీకొన్నాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వేరే ఆటోలో ఆస్పత్రికి తరలించారు.

కంటైనర్‌లో తరలిస్తున్న 43 పశువుల పట్టివేత

ఎలమంచిలి, ఏప్రిల్ 2 : కంటైనర్‌లో అనధికారికంగా తరలిస్తున్న 43 పశువులను పట్టుకుని విశాఖలోని గోశాలకు తరలించినట్టు రూరల్ ఎస్సై సింహాచలం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం... మండలంలోని రేగుపాలెం జంక్షన్ జాతీయ రహదారిపై మంగళవారం అనుమానాస్పదంగా ఉన్న కంటైనర్‌ను పోలీసులు తనిఖీ చేయగా అందులో సుమారు 43 పశువులు ఉన్నట్టు గుర్తించారు. పశువుల తరలింపునకు సంబంధించి డ్రైవర్ వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేశారు. వీటిని ఒడిశాలోని నవరంగాబాద్ నుంచి అనంతపురంజిల్లాలోని హిందుపురం సంతకు తరలిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. పట్టుకున్న పశువులను విశాఖలోని జ్ఞానానంద గోశాలకు తరలించారు. కంటైనర్‌ని స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

నక్కపల్లిలో 65 గోవులు..

నక్కపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా నుంచి హైదరాబాద్ సమీపంలో కబేళాకు గోవులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు డీఎస్పీ మోహన్, నక్కపల్లి సీఐ విజయ్‌కుమార్ సిబ్బందితో వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేపట్టారు. ఈమేరకు కంటైనర్‌ను తనిఖీ చేయగా అందులో 65 గోవులున్నట్టు గుర్తించారు. కంటైనర్‌ను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశామని, గోవులను సురక్షితంగా పలు ప్రాంతాల్లోని గోశాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామని సీఐ చెప్పారు.

11 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2: పట్టణంలోని దుకాణాల నుంచి మద్యం కొనుగోలు చేసి వెళ్తున్న వ్యక్తిని సుంకరమెట్ట జంక్షన్ వద్ద పోలీసులు పట్టుకుని 11 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌సీ రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం... కొత్తూరు నరసింగరావుపేటకు చెందిన గొన్నాబత్తుల జయ సంతోష్ పట్టణంలోని పలు దుకా ణాల్లో 11 మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి బ్యాగ్‌లో తీసుకెళ్తుండగా పోలీసులు అనుమానం వచ్చి తనిఖీ చేశారు. ఈమేరకు 11 బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

విద్యార్థిని ఆత్మహత్య కేసులో ఐదుగురు అరెస్టు

» లైంగిక వేధింపులు జరిగినట్లు నిర్ధారణ : డీసీపీ మణికంఠ

మహారాణిపేట, ఏప్రిల్ 2 : మధురవాడలోని చైతన్య పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఐదుగురిని అరెస్టు చేసినట్లు డీసీపీ వీఎన్ మణికంఠ తెలిపారు. మంగళవారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు తెలిపారు. మార్చి 28 వ తేదీన మధురవాడ ఇంజనీరింగ్ పాలిటెక్నిక్ కాలేజీలో డిప్లొమో మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి కాలేజీలో జరిగిన లైంగిక వేధింపులపై తండ్రి సెల్ ఫోన్‌కు మెజేజ్ ద్వారా తెలియపరచి కళాశాల మేడ మీద నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదుచేసి విచారించిన పోలీసులు కాలేజీలో లైంగిక వేధింపులు జరిగినట్లు నిర్ధారించారు. కెమిస్ట్రీ ల్యాబ్ టెక్నిషియన్‌గా పని చేస్తున్న నూనెల శంకరరావు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం కూడా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. ఈ కేసులో కళాశాల యాజమాన్యం నుంచి శంకర్ వర్మ, డిప్లొమో కాలేజీ ప్రిన్సిపాల్ జీ భానుప్రవీణ్, హాస్టల్ వార్డెన్ వంటపతి ఉషారాణి, ఆమె భర్త ప్రదీప్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు.

ఠారెత్తిస్తున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న అనకాపల్లి మెయిన్ రోడ్డు

అనకాపల్లి టౌన్/కోటవురట్ల, ఏప్రిల్ 2 : అనకాపల్లిలో ఉష్ణోగ్రతలు రోజురోజుకి పెరుగుతున్నాయి. మూడు రోజులుగా ఎండలకు తోడు వేడిగాడ్పులు వీస్తుండడంతో ప్రజలు ఉదయం 11 గంటల తరువాత ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. అనకాపల్లిలో ఆది, సోమవారం అత్యధిక ఉష్ణోగ్రత 36.8 డిగ్రీలు నమోదు కాగా మంగళవారం 37.0 డిగ్రీలకు పెరిగింది. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. కోటవురట్లలోనూ 36.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	113.00
లైవ్ ధర	133.00
విత్ స్కిన్	236.00
స్కిన్ లెస్	246.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

అధికారులు నిబద్ధతతో పనిచేయాలి

» ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం, భయం కూడదు

» జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



శిక్షణలో మట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, తదితరులు

అనకాపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): రానున్న సార్వత్రిక ఎన్నికలలో అధికారులు, సిబ్బంది ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మస్థైర్యంతో, నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి సూచించారు.కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ భయం లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు శిక్షణ దోహదపడాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులకు విధులపై శతశాతం నమ్మకం, నిబద్ధత కలుగజేయాలని సూచించారు. చెక్‌లిస్ట్ తీసుకోవడం, తిరిగి అప్పగించడం, మాక్ ఓటింగ్‌తో పాటు పోలింగ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తరువాత ఏంచేయాలో క్షుణ్ణంగా అవగాహన కల్పించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం తనిఖీ చేసి చూపించడం, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు తెలియజేయడంపై తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎటువంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలింగ్ ప్రారంభమైన తరువాత ఎక్కువ మంది వుంటే ఏవిధంగా నియంత్రించవచ్చు, దివ్యాంగుల ఓటింగ్ విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. వివిధ రకాల ఓట్లను ఏవిధంగా నిర్వహించాలో విపులంగా చెప్పాలన్నారు.అనంతరం అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పోలింగ్ శిక్షణ విధివిధానాలను మాస్టర్ ట్రైనీలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల డీఎం జయంతి, డీఎల్‌డీఓ నాగమణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి. రామ్మూర్తి, అన్ని మండలాల నుంచి 52 మంది మాస్టర్ ట్రైనీలు హాజరయ్యారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

» బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

» 'పేట'లో టీడీపీ, జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్

పాయకరావుపేట, ఏప్రిల్ 2 : వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించి, ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ అన్నారు. మంగళవారం పాయకరావుపేటలో నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి పక్కనపెట్టి అరాచక పాలన సాగిందన్నారు. ఆ పార్టీ నాయకులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోలేదని విమర్శించారు. ఏడాదికో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి యువతను మోసం చేశారన్నారు. పలుమార్లు ప్రధానిని కలిసిన జగన్ ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాల కోసం అడిగిన సందర్భాలు లేవన్నారు. జగన్ రాష్ట్రానికి చేస్తున్న ద్రోహాన్ని బీజేపీ గుర్తించిందని,అందుకే రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీలకు మద్దతు ఇచ్చిందని చెప్పారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం ట్రిబుల్ ఇంజన్ సీడ్‌తో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనితను ఓడించేందుకు వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా..అడ్డుకుంటామన్నారు. ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక జిల్లాను పారిశ్రామింగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు వంగలపూడి అనిత మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా సీఎం.రమేశ్‌ని గెలిపించేందుకు మూడు పార్టీల శ్రేణులు కృషిచేయాలని కోరారు. అంతకుముందు జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీగా పాయకరావుపేట వచ్చిన సీఎం రమేశ్‌కి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పూల వర్షం, గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్దా నాగజగదీశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి.పరమేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవిరాజుతోపాటు నాలుగు మండలాల టీడీపీ, జనసేన, బీజేపీ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాల పేరుతో జగన్ మోసం

» విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల మావోయిస్టు కమిటీ కార్యదర్శి అరుణ

» బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని పిలుపు

జి.మాడుగుల (అల్లూరి సీతారామ రాజు జిల్లా), ఏప్రిల్ 2: గత ఎన్నికల ముందు ఓట్ల కోసం నవరత్నాల పేరుతో వైసీపీ ప్రజలకు మోసం చేసిందని విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి (వీఏఏ) జిల్లాల మావోయిస్టు కమిటీ కార్యదర్శి అరుణ ఓ ప్రకటనలో ఆరోపించారు. ఆమె పేరుతో మంగళవారం స్థానిక విలేకరులకు లేఖ అందింది. జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామన్న హామీలు ఏమయ్యాయని లేఖలో ఆమె ప్రశ్నించారు. జీవో నంబరు-3 రద్దు నేపథ్యంలో ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టినా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. మరీ ముఖ్యంగా వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బాక్సైట్ తవ్వకాలకు సంబంధించి జీవో నంబరు-97 రద్దు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని, తీరా అధికారంలోకి వచ్చాక 89 జీవోను ముందుకుతెచ్చి బినామీ పేర్లతో బాక్సైట్ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని లేఖలో ఆమె పిలుపునిచ్చారు. అధికార వైసీపీతో పాటు మిగిలిన బూర్జువా పార్టీలు సైతం అధికారం కోసం కుమ్ములాటలు, పార్టీల ఫిరాయింపులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. అవకాశవాద కూటములు, బ్లాక్‌మెయిలింగ్ పద్ధతులు, కుల, మతాల సమీకరణాలకు పూనుకుంటున్నాయని, ఇందులో భాగంగానే ఆచరణ సాధ్యంకాని హామీలతో మరోసారి మోసాలకు నాయకులు పాల్పడుతున్నారని మావోయిస్టు నేత అరుణ లేఖలో ఆరోపించారు.

ఎంపీ సీటు ఆఫర్ చేసిన వైసీపీ

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయ విజయ్



విలేకరులతో మాట్లాడుతున్న చింతకాయల విజయ్

నర్సీపట్నం, ఏప్రిల్ 2: తనను ఎంపీగా పోటీ చేయమని వైసీపీ నుంచి ఆఫర్ వచ్చిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. మంగళవారం ఆయన ఇక్కడి విలేఖరులతో మాట్లాడారు. 2019లో మిధున్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి వైసీపీ తరఫున ఎంపీగా పోటీ చేయమని అడిగారని, ఇప్పుడు కూడా సీఎం ముఖ్య సలహాదారు ఒకరు తనకు ఫోన్ చేసి అడిగారని చెప్పారు. టీడీపీలోనే ఉంటానని చెప్పి, తిరస్కరించానన్నారు. సిటీ క్లబ్‌లో అక్రమంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి, శిలాఫలకంపై పేరు వేయించుకోవడానికి ఎమ్మెల్యే గణేశ్‌కి సిగ్గుండాలని విమర్శించారు. సిటీ క్లబ్ షాపులకు మునిసిపాలిటీ ప్లాన్ ఎక్కడుందని ప్రశ్నించారు. నర్సీపట్నంలో చేసిన అభివృద్ధి గురించి మాట్లాడకుండా సీనియర్ నాయకుడు అయ్యన్నపాత్రుడుని ఉద్దేశించి ఎమ్మెల్యే ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని, గొలుగొండ మండలం ఆరిలోక రోడ్డు ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. ఆ రోడ్డు నిర్మాణానికి అయ్యన్నపాత్రుడే నిధులు తెచ్చారని గుర్తు చేశారు. ఓటు హక్కు లేని వారికి కండువాలు వేసి పార్టీలో చేరినట్టు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రూ. 7 లక్షలు పెట్టి తాండవ రిజర్వాయర్ గేట్లకు మరమ్మతు చేయించలేకపోయారన్నారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాలికమల్లవరంలో తవ్వించిన రంగురాళ్లపై విచారణ చేయిస్తామని చెప్పారు.



ఆందోళన చేస్తున్న హాస్టల్ విద్యార్థినులు

ఏయూలో హాస్టల్ విద్యార్థినుల ఆందోళన

భోజనంలో పురుగులు వస్తున్నాయని ఆరోపణ

విశాఖపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): భోజనంలో పురుగులు ఉంటున్నాయని, మెస్ చార్జీలు నిర్ణీత మొత్తం కంటే అదనంగా వసూలు చేస్తున్నారంటూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు మంగళవారం సాయంత్రం ఆందోళనకు దిగారు.వైస్ చాన్సలర్, రిజిస్ట్రార్‌ను కలిసి తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు వచ్చిన విద్యార్థినులను సెక్యూరిటీ సిబ్బంది లోపలకు అనుమతించకపోవడంతో పక్కనే ఉన్న గాంధీ విగ్రహం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. వీసీ బయటకు రావాలంటూ నినాదాలు చేశారు. ఏటా హాస్టల్‌కు రూ.4,250 వసూలు చేస్తున్నారని, అది కాకుండా ప్రతి నెలా కనీసం వేయి వరకు అదనపు చార్జీల పేరుతో వసూలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. విద్యుత్ చార్జీలను తమతోనే కట్టిస్తున్నారని, హాస్టల్‌లో ఒక్కో రూమ్‌లో నలుగురు విద్యార్థులు ఉంటే ఒక్కొక్కరి నుంచి రూ.300 చొప్పున కరెంట్ బిల్లు కింద వసూలు చేస్తున్నారని విద్యార్థినులు వాపోయారు. భోజనంలో పురుగులు వస్తున్నాయని, దీనిపై అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. నీటి కొళాయిలు (ట్యాప్‌లు) 12 ఉంటే నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. గతంలో ఏడాదికి రూ.4,250 ఉన్న ఫీజును ప్రస్తుతం రూ.8 వేలకు పెంచారన్నారు. అదనంగా చెల్లించే మొత్తానికి బిల్లులు ఇవ్వడం లేదని, దీనిపై వార్డెన్‌ను అడుగుతున్నా స్పందించడం లేదన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారని విద్యార్థినులు వాపోయారు.

చర్చలకు పిలిచి బెదిరింపులు

విద్యార్థినుల ఆందోళన విషయం తెలుసుకున్న ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శశిభూషన్, ఏయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ కృష్ణమోహన్, ఇతర అధికారులు చర్చలకు పిలిచారు. అయితే సమస్యలు చెప్పేందుకు ముందుకువచ్చిన వారిని బెదిరించే ప్రయత్నం చేశారు. 'నీ పేరేంటి, ఏ బ్రాంచ్..' అంటూ గట్టిగా ప్రశ్నించడంతో విద్యార్థినులు తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు భయపడ్డారు. తమ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు బెదిరించే ప్రయత్నం చేయడం దారుణమంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శశిభూషణ్ మాట్లాడుతూ విద్యార్థినులు ఇబ్బందులను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేవాడినన్నారు. వారి సమస్యలను కాగితంపై రాసి ఇవ్వాలని సూచించినట్టు చెప్పారు.

ఎట్టకేలకు రైళ్ల పునరుద్ధరణ

ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు

అనకాపల్లి టౌన్,ఏప్రిల్ 2 : ట్రాక్ నిర్వహణ పనుల నేపథ్యంలో రెండు నెలలకు పైగా నిలిచిపోయిన పలు రైళ్లు తిరిగి అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకుంటున్నారు. జనవరి 19 నుంచి విశాఖ-గుంటూరు సింహాద్రి ఎక్స్‌ప్రెస్,29 నుంచి కాకినాడ పోర్టు-విశాఖ, రాయగడ-గుంటూరు రైళ్లతో పాటు మచిలీపట్నం-విశాఖపట్నం రైళ్లు నిలిపివేశారు. అప్పటి నుంచి విశాఖ, విజయవాడ మార్గంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు కాకినాడ, సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు సోమవారం సాయంత్రం నుంచి అనకాపల్లి పట్టణ వాసులకు అందుబాటులోకి వచ్చాయి. మంగళవారం నుంచి రాయగడ రైలు అందుబాటులోకి రావడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. అనకాపల్లి రైల్వేస్టేషన్ మీదుగా నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి నుంచి ప్రతి రోజూ చిరుద్యోగులు,వ్యాపారులు, విద్యార్థులు, పైనాన్సర్లతో పాటు వివిధ పనులపై విశాఖ వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంటుంది. వీరికి కాకినాడ పోర్టు నుంచి విశాఖ వెళ్లే రైలు అందుబాటులో ఉండేది. రెండు నెలలుగా ఇబ్బందులు పడిన వీరికి ఈ రైలు మళ్లీ అందుబాటులోకి రావడంతో పాటు రాయగడ, సింహాద్రి కూడా తిరుగుతుండడంతో ప్రయాణ ఇక్కట్లు తప్పాయి. ఇంకా మచిలీపట్నం- విశాఖపట్నం రైలు పట్టాలు ఎక్కాల్సి ఉందని స్టేషన్ సూపరింటెండెంట్ సచ్చినివాస్ తెలిపారు.

దువ్వాడ మీదుగా హౌరా, యశ్వంత్‌పూర్ ప్రత్యేక ఏసీ రైలు

విశాఖపట్నం, ఏప్రిల్ 2: దువ్వాడ మీదుగా హౌరా, యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెడుతున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 02863 నంబరు గల రైలు ఈనెల 4, 11న (ప్రతి గురువారం) మధ్యాహ్నం 12.40 గంటలకు హౌరాలో బయలుదేరి మర్నాడు తెల్లవారుజాము 2.43 గంటలకు దువ్వాడ, అదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు (తెల్లవారితే శనివారం) యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02864 నంబరు గల రైలు ఈనెల 6,13న (ప్రతి శనివారం) ఉదయం 5.00 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, మర్నాడు మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో మామిడిపాలెం విద్యార్థికి స్వర్ణ పతకం



దీనరాజును అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

తుమ్మపాల, ఏప్రిల్ 2: ఎన్టీఆర్ జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి వి. దీనరాజు బంగారు పతకం సాధించారు. అండర్-17 కేటగిరీలో 93 కిలోల విభాగంలో ఈ పతకం పొందాడు. ఈమేరకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

9న అప్పన్న పందిరిరాట

సింహాచలం, ఏప్రిల్ 2: వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం ఈనెల 9న పందిరిరాటతో మొదలు కానుంది. ఏటా చైత్రమాస శుక్లపక్ష దశమి నుంచి పూర్ణిమ వరకు స్వామివారి వార్షిక తిరుకల్యాణ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు 9న ఉగాది నాడు మధ్యాహ్నం 4 గంటలకు పంచాంగ శ్రవణం, 5 గంటలకు స్వామివారి వార్షిక తిరు కల్యాణోత్సవానికి పందిరి రాట ఉడుపు జరుపుతారు. 14న మేష సంక్రమణం, తమిళ సంవత్సరాది. 15న పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని గంగధార సమీప సీతారామస్వామి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం చేస్తారు. 17న శ్రీరామనవమి, 18న మృత్స్న గ్రహణం, అంకురారోపణంతో ఉత్సవాలు జరుగుతాయి. 19న కొట్నాల ఉత్సవం, ధ్వజారోహణం, ఎదురుసన్నాహము, రాత్రి 8 గంటలకు రథోత్సవం, 9.30 గంటలకు వార్షిక తిరు కల్యాణ మహోత్సవం. 21న ఉదయం వైదిక సదస్యం, సాయంత్రం వేద పండిత సదస్యం. 22న స్వామివారి మాస జయంతి, 23న పూర్ణాహుతి, అవబృధోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, రాత్రి మృగయోత్సవం (దొంగల దోపు), 24న వినోదోత్సవం (ఉంగరపు సేవ), రాత్రి శ్రీ పుష్పయాగం, 25న నమ్మాళ్వార్ తిరునక్షత్రం, 28న మణవాళ్ల మహామునుల తిరునక్షత్ర ఉత్సవం జరగనున్నాయి.

టెన్త్ మూల్యాంకనం కేంద్రాలు పరిశీలన



మూల్యాంకణాలను పరిశీలిస్తున్న విజయ్‌భాస్కర్

అనకాపల్లి టౌన్,ఏప్రిల్ 2 : అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాల, ఏఎంఏఎల్ హైస్కూల్‌లో జరుగుతున్న పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనాన్ని జోన్-1 ప్రాంతీయ విద్యా సంచాలకుడు విజయ్‌భాస్కర్ మంగళవారం పరిశీలించారు. మూడు కేంద్రాల్లో జరుగుతున్న మూల్యాంకనాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఆయనతో పాటు డీఈవో వెంకటలక్ష్మమ్మ ఉన్నారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఉద్యోగిపై చర్యలు



గత నెల 31న ధర్మశ్రీ ప్రచార సభలో పాల్గొన్న కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగి పిల్లా నూకరాజు (వృత్తంలో ఉన్న వ్యక్తి)

రోలుగుంట మార్చి 2: వైసీపీ ఎన్నికల ప్రచారంలో రోలుగుంట పీఏసీఎస్ ఉద్యోగి పిల్లా నూకరాజుపై చర్యలకు రంగం సిద్ధమయింది. గత నెల 31న రోలుగుంట సాయిబాబా ఆలయ సమీపంలో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పిల్లా నూకరాజు పాల్గొనడమే కాకుండా ముందు వరుసలో కూర్చున్నారు. సమావేశంలో అతడు పాల్గొన్న ఫొటోలు, వీడియాలను టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు పంపించి, ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి రూపొందించిన నివేదికను ఆర్ఓ చిన్నికృష్ణకు పంపించామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్యామల మంగళవారం విలేకరులకు తెలిపారు. నివేదిక ఆధారంగా అతనిపై చర్యలు ఉంటాయని ఎన్నికల అధికారిణి తెలిపారు.

పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బోని తాతారావు

పాయకరావుపేట, ఏప్రిల్ 2: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థిగా విశాఖ నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ బోని తాతారావును ఆ పార్టీ అధిష్ఠానం ఎంపిక చేసింది. తాతారావు కొంతకాలంగా పాయకరావుపేట నియోజకవర్గంలో పలు వైద్య శిబిరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశించినా దక్కకపోవడంతో జై సమైక్యాంధ్ర పార్టీ తరఫున పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 1,279 ఓట్లు వచ్చాయి.

'సౌత్'లో కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యం

బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీతంరాజు సుధాకర్

మహారాణిపేట, ఏప్రిల్ 2 : విశాఖ దక్షిణ నియోజకవర్గంలో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌కు మద్దతు ఇస్తూ ఆయన గెలుపునకు కృషిచేస్తానని బ్రాహ్మణ కార్పొ రేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ప్రకటించారు. మంగళవారం ఆయన బీచ్ రోడ్డులోని తన కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గంలోని అనుచరులు, ఆత్మీయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ గతంలో వైసీపీ బలోపేతానికి కృషిచేశానని, పార్టీ కోసం సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేశానన్నారు. కానీ తనకు జగన్ మాట ఇచ్చి, తప్పారన్నారు. అందుకే వైసీపీకి రాజీనామా చేశానన్నారు. త్వరలో తెలుగుదేశం పార్టీలో చేరతానన్నారు. ఈ ఎన్నికల్లో దక్షిణ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ గెలుపునకు కృషిచేస్తాన్నారు.

పవన్ కల్యాణ్ దృష్టికి ఉత్తరాంధ్ర ప్రధాన సమస్యలు : కొణతాల



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పీలా

కొత్తూరు, ఏప్రిల్ 2 : ఉత్తరాంధ్రలో ప్రధాన సమస్యలను ఇప్పటికే జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు వివరించినట్టు అనకాపల్లి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక రింగురోడ్డులోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లిలో ఐదో తేదీన జరిగే సమావేశంలో పవన్‌కల్యాణ్ ఇవ్వనున్న హామీల కోసం అంతా ఎదురు చూస్తున్నామన్నారు. అనకాపల్లిలో మూతపడిన తుమ్మపాల చక్కెర కర్మాగారం స్థానంలో ప్రత్యామ్నాయంగా రైతులకు ఉపయోగపడే విధంగావిత్తనాల తయారీ ఫ్యాక్టరీని నిర్మించి, వారికి అందుబాటులోకి తీసుకురావాలని కోరామన్నారు. అలాగే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ప్రాజెక్టు, స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ వంటి సమస్యలతో పాటు, కశింకోట ఆర్ఈసీఎస్‌ను ఏపీ ఈపీడీసీఎల్‌లో విలీనం చేశారని దానిని మళ్లీ కో-ఆపరేటివ్ సొసైటీగా తీసుకువస్తే ఈ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించినట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, బీజేపీ కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తెట్టి పెంటారావు, జనసేన నాయకులు బుదిరెడ్డి చిన్న, గోపి, శ్రీరాందాసు గోవింద పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు మద్దతు పలికారు. ఈ మేరకు మంగళవారం కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలను వారంతా కలిసి భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాస్, ఎలకా మల్లిబాబు, కొల్లి చినఅప్పారావు, ఘాటీలు, కట్టమూరి మంగరాజు, చెవ్వేటి అప్పారావు పాల్గొన్నారు.

కూటమి విజయమే లక్ష్యం కావాలి

▸▸ ఎలమంచిలి నియోజకవర్గ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో 'బుద్ద'



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బుద్ద

ఎలమంచిలి, ఏప్రిల్ 2 : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే అందరి లక్ష్యం కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్ పిలుపునిచ్చారు. ఎలమంచిలిలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం ఏర్పాటైన టీడీపీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. నీతి, నిజాయితీకి చంద్రబాబు నిలువుటద్దమన్నారు. అటువంటి సమర్థుడు రాష్ట్రానికి అవసరమన్నారు. అనకాపల్లి ఎంపీ స్థానానికి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో ఉన్న సీఎం రమేశ్ వంటి నాయకుడ్ని గెలిపించుకుంటే జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. బుధవారం అచ్యుతాపురంలో సీఎం రమేశ్, సుందరపు విజయ్‌కుమార్‌లు నిర్వహించే కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలన్నారు. అనంతరం ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థుల విజయానికి కష్టపడి పనిచేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, సీఎం రమేష్ సోదరుడు రాజేష్, నాయకులు కొలుకులూరి విజయ్‌బాబు, ధూళి రంగనాయకులు, కాండ్రకోట చిరంజీవి, ఆడారి మంజు, ఇత్తంశెట్టి రాజు, దొడ్డి శ్రీను, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రాజాన నారాయణమ్మ, రాజాన సూర్య నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన అంతమే పంతం కావాలి

▸▸ మంగవరం ఎన్నికల ప్రచార సభలో మాజీ ఎమ్మెల్యే అనిత



మంగవరంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అనిత

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో రాక్షస పాలన అంతమే అందరి పంతం కావాలని తెలుగు మహిళ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. మండలంలోని మంగవరం, అరట్లకోట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందని, తిరిగి బాగుపడాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఈసారి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.రవిరాజు, జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు ఎగదాసు నానాజీ, వేముల వెంకటేశ్వరరావు, గొర్రెల రాజబాబు, యాళ్ళ వరహాలు, కె.వెంకటేశ్వరరావు, బి.కాశీవిశ్వనాథం, చిక్కాల శ్రీను, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై రైల్వే స్టేషన్‌లో అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 : ఇక్కడి రైల్వే స్టేషన్‌లో ఓటు వినియోగంపై ప్రయాణికులకు మంగళవారం రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. ఓటు హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. అనకాపల్లి నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారిణి లీలాశేషకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

మైనార్టీ మోర్చా కో-ఆర్డినేటర్ల నియామకం

కొత్తూరు, ఏప్రిల్ 2 : మైనార్టీ మోర్చా అనకాపల్లి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల కో-ఆర్డినేటర్లుగా షేక్ ఇబ్రహీం బాషా, షేక్ సబీర్ అహ్మద్‌లు నియామకమయ్యారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాజీ ఆధ్వర్యంలో తమను నియమించారని ఉమ్మడి అభ్యర్థులు గెలుపునకు కృషి చేస్తామని వారు వివరించారు.

'ఎన్నికల నియమావళిని పాటించండి'



పార్టీల నాయకులు సూచనలిస్తున్న ఆర్‌వో మనోరమ

ఎలమంచిలి, ఏప్రిల్ 2 : ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు విధిగా పాటించాలని నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ మనోరమ సూచించారు. మంగళవారం ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిందిగా కోరారు. బరిలో ఉన్న అభ్యర్థుల ఎన్నికల వ్యయం, వాటి ఖర్చులు తదితరాలను వివరించారు. ఈసమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

బాబు సీఎం కావడం చారిత్రక అవసరం

▸▸ కూటమి పెందుర్తి అభ్యర్థి 'పంచకర్ల'



వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారితో పంచకర్ల రమేశ్

సబ్బవరం, ఏప్రిల్ 2 : వైసీపీ పాలనలో అన్నిరంగాల్లో నష్టపోయిన రాష్ట్రానికి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం చారిత్రక అవసరమని పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని అరిపాక శివారు పెదయాతపాలెంలో జరిగిన తొలి ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. అస్తవ్యస్తంగా మారాని ఆంధ్రప్రదేశ్‌ను గాడిలో పెట్టే సత్తా చంద్రబాబు, పవన్‌కు మాత్రమే ఉందన్నారు. వైసీపీ నుంచి జనసేనలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కూటమి నేతలు నాయకులు కాళ్ల శ్రీను, ఆడారి వెంకట్, వెంకటరమణ, కనకరాజు, బీఏ రావు, దుర్గాప్రసాద్, పిన్నం రాజు, కన్నంనాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమి గెలుపునకు అంతా సహకరించాలని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు కోరారు. మంగళవారం తానాం, భరణికం, వాడ చీపురుపల్లి, తాడి, ఫార్మాసిటీ పునరావాస కాలనీలలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్‌లు కన్నూరుదేవి, శివలంక లక్ష్మితో పాటు పలువురు టీడీపీ శ్రేణులను ఆయన వేర్వేరుగా కలిసి తనతో పాటు ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. నాయకులు మోటూరు సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసకాసులు, అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ, డీఎంఎల్ నాయుడు, వర్రి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

'సార్వత్రిక ఎన్నికల్లో మూడు పార్టీల సత్తా చూపండి'



సమావేశంలో మాట్లాడుతున్న దిన్‌బాబు

రాంబిల్లి, ఏప్రిల్ 2 : సార్వత్రిక ఎన్నికల్లో ఎలమంచిలి నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అంతా పనిచేయాలని టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పంచదార్లలోని ఆయన నివాసంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి సుందపు విజయ్‌కుమార్, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌లను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం వీరి తరపున ప్రచారానికి సంబంధించిన ప్రణాళికను రూపొందించారు. ఎలమంచిలిలో జరిగిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుపై దాడిని అంతా ముక్తకంఠంతో ఖండించారు. ఈ సమావేశంలో నాయకులు కశిరెడ్డి ప్రసాద్, చోడిపల్లి సత్యనారాయణ, దేముడు, కర్రి సింగహరిగి ప్రసాద్, కె.ఈశ్వరరావు, వేగిరాము తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు: అనకాపల్లి గవరపాలెం సతకంపట్టు ప్రాంతానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. అనకాపల్లి ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ధ భూలోక నాయుడు, మంగా ఈశ్వర్, మళ్ళ శ్రీను, పి.వి.రమణ, సూర్య, కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ మారు వారం పండగ



పైడిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పరవాడ, ఏప్రిల్ 2 : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పరవాడ పైడిమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం వైభవంగా జరిగింది. వేకువజాము నుంచి భక్తులు బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి శ్రీనివాస్ దంపతులతో పాటు సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

బయటకు పంపించేశారు.

వలంటీర్లు, ఇంటి యజమానిపై కేసు నమోదు

ఈ వ్యవహారంలో 15 మంది వలంటీర్లు, ఇంటి యజమానిపై కేసు నమోదు చేశామని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. వలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులో భాగంగా ఫ్లయింగ్‌స్క్వాడ్, ఆర్బన్ నోడల్ అధికారి తనిఖీ చేశారని, కొంతమంది వలంటీర్లు గోడదూకి వెళ్లిపోయారని వివరించారు. తాళం వేసి ఉన్న గదిలో తనిఖీ చేయడానికి యత్నించగా ఇంటి యజమాని తాళాలు లేవని చెప్పడంతో వాటిని పగలగొట్టి తలుపు తెరిచి చూడగా అందులో 15 మంది వలంటీర్లు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో తొమ్మిది మంది మహిళా వలంటీర్లు, ఆరుగురు పురుష వలంటీర్లు, ఇంటి యజమానిపై కేసు నమోదు చేశామని వివరించారు.

ముసుగు తొలగింది

... 5వ పేజీ తరువాయి

ప్రచారంలో కీలకపాత్ర పోషించకూడదని అధికారులు హెచ్చరించడం లేదు. అలా చేస్తే ఏ ఉద్యోగాలు రావని కూడా చెప్పడం లేదు. వారు కూడా అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు.

ఇదీ అసలు కారణం?

కేంద్ర ఎన్నికల సంఘం మూడేళ్లకు పైబడిన అధికారులను ఆయా ప్రాంతాల నుంచి బదిలీ చేసినట్టే..గత నాలుగేళ్లుగా గ్రామాలు, వార్డుల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కాకూడదని స్పష్టంచేసింది. ప్రతి నెలా వీరి ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు, పెన్షన్లు ఇస్తున్నందున ఓటర్లు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని, ఆ పనులు కూడా వారికి అప్పగించవద్దని ఆదేశించింది. ఏప్రిల్ ఒకటో నుంచి పింఛన్ల పంపిణీ బాధ్యతలు ఇవ్వవద్దని సూచించింది. దీనిని అధికార పార్టీ వైసీపీ జీర్ణించుకోలేకపోయింది. అసలు పింఛన్లు ఇవ్వడానికి నిధులు లేవనే విషయం దాచిపెట్టి, ప్రతిపక్ష పార్టీలు కుట్ర వల్లే ఇదంతా జరుగుతున్నదని దుష్ప్రచారం ప్రారంభించింది. పేదలు, వృద్ధులకు పింఛన్లు సకాలంలో ఇవ్వడం కష్టమేనని ప్రచారం ప్రారంభించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో బుధవారం నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి ఏర్పాట్లుచేసింది.

వలంటీర్ల రాజీ డ్రామా!

... 5వ పేజీ తరువాయి

చర్చనీయాంశమవుతుంది. కాగా సోమవారమే రాజీనామా చేసినట్టు ప్రకటించిన వలంటీర్లు మంగళవారం వాటిని మండల పరిషత్ కార్యాలయానికి పంపారు. ఈ విషయాన్ని మండల పరిషత్ ఏవో రాంబాబు వద్ద ప్రస్తావించగా రాజీనామా పత్రాలు మంగళవారమే తమ కార్యాలయానికి చేరాయని నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి మహేష్‌ను వివరణ కోరగా తమ కార్యాలయానికి ఎవరూ రాజీనామా పత్రాలు అందజేయలేదన్నారు. ఇదిలావుండగా ఈ విషయాన్ని ఎంపీడీవో కీర్తి వద్ద ప్రస్తావించగా సోమవారమే వలంటీర్లు రాజీనామా పత్రాలు కార్యాలయానికి అందజేశారని చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారంలో వైసీపీ నేతలకు అనుకూలంగా ఎంపీడీవో వ్యవహరించడం చర్చనీయాంశమవుతోంది.

చర్యలు తీసుకోవాలి

వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేయకముందే ఎమ్మెల్యే అదీప్ రాజ్, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు సమక్షంలో వైసీపీ అనుకూల నినాదాలు చేయడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని తానాం సర్పంచ్ కన్నూరి దేవి మండిపడ్డారు. కోడ్‌ను బేఖాతరు చేసిన వలంటీర్లతో పాటు ఎమ్మెల్యే జడ్పీటీసీ సభ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.

కొనసాగుతున్న రాజీనామాలు

పెందుర్తి: పెందుర్తి మండలంలో మంగళవారం మరో 16 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇందులో ఎమ్మెల్యే అదీప్ రాజ్ స్వగ్రామమైన రాంపురంలో 14 మంది, గొరపల్లికి చెందిన ఇద్దరు వలంటీర్లు ఉన్నారు. సోమవారం గొరపల్లిలో 13 మంది, గత నెల 30న రాజయ్యపేటలో ఒకరు రాజీనామా చేశారు. దీంతో మండలంలో రాజీనామా చేసిన వలంటీర్ల సంఖ్య సుమారు 30 మందికి చేరింది.

కశింకోట మండలంలో 104 మంది

కశింకోట మేజర్ పంచాయతీ నాలుగు సచివాలయాల పరిధిలో 89 మంది వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మొత్తం 91 మంది ఉండగా వారిలో ఇద్దరు గతంలోనే రాజీనామా చేశారు. ఈ మేరకు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, వేలిముద్ర పరికరాలను అందజేశారని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. కశింకోట మండలం బయ్యవరం గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు, విస్సన్నపేట గ్రామానికి చెందిన ఒక వలంటీరు మంగళవారం రాజీనామా చేశారని ఎంపీడీవో శేషుబాబు తెలిపారు. అనకాపల్లి జీవీఎంసీ 11వ వార్డు సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న శరగోపం వెంకట విజయ ఉద్యోగానికి రాజీనామా చేస్తూ లేఖ ఇచ్చినట్టు అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మంగళవారం తెలిపారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఆర్‌వో



నాయకులకు సూచనలు చేస్తున్న ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి, ఏప్రిల్ 2 : ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పాయకరావుపేట నియోజకవర్గం ఆర్వో కె.గీతాంజలి హెచ్చరించారు. మంగళవారం రాత్రి నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పలు పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎవరైనా సరే ఎన్నికల ప్రచారం చేసుకున్నా, సభలు నిర్వహించినా, ముందస్తు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఇతరులకు ఇబ్బందికలిగే చర్యలు చేపట్టకూడదని సూచించారు. వలంటీర్లు రాజకీయాలకు, ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉంటున్నారని, అన్ని గ్రామాల్లో కూడా నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ఫ్లైయింగ్ స్క్వాడ్స్ సహా పలు ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నాయన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎన్నికల డీటీ చైను, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణం కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 : పట్టణంలోని మెయిన్‌రోడ్డు చిన్నబజార్ వద్ద గల సీతారాముల ఆలయంలో మంగళవారం సీతారామ కల్యాణ మహోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 15న సీతారాముల పెళ్లి రాట, 17న సీతారామస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రత్యేక కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు కొణతాల జగన్నాథరావునాయుడు (జగన్), కె.నారాయణరావు, కార్యదర్శి సిరసపల్లి సూరిబాబు, కోశాధికారి దాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కామధేనువు ప్రసాద్, కార్యదర్శి సిరసపల్లి రాజు, కోశాధికారి విన్నకోట నీలేష్‌గుప్త, కన్వీనర్ పచ్చర్ల వెంకట అప్పారావు తదితరులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన సదస్సు



పెదబోదిగల్లం అవగాహన కల్పిస్తున్న సీఐ విజయ్ కుమార్

నక్కపల్లి, ఏప్రిల్ 2 : మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలో మంగళవారం రాత్రి సీఐ విజయ్‌కుమార్ పలు అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాట్సాప్‌లో గుర్తు తెలియని లింక్‌లు ఓపెన్ చేయడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రతి ఒక్కరూ విధిగా కోడ్ పాటించాల్సిందేనని చెప్పారు. కనీస జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవచ్చునని చెప్పారు.

విస్తృతంగా పోలీసులు వాహన తనిఖీలు



ఎలమంచిలి, సబ్బవరంలలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎలమంచిలి/ సబ్బవరం, ఏప్రిల్ 2 : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం మంగళవారం ఇక్కడ విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో పట్టణంలోకి వచ్చే వాహనాలను ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. డబ్బు, మద్యం వంటివాటిని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అలాగే, సబ్బవరం మండలంలోని జాతీయ రహదారి మర్రిపాలెం చెక్ పోస్టు వద్ద సీఐ పిన్నింటి రమణ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అంతా నడుచుకోవాలని ఆయన సూచించారు.

'అభివృద్ధిని చూసి గెలిపించండి'

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 2 : గత ఐదేళ్లలో ఎలమంచిలి పట్టణాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్టు ఎమ్మెల్యే కన్నబాబురాజు తెలిపారు. మంగళవారం మండలంలోని కొండకర్ల అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి రోడ్డును మరో పదిహేను రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. ఈసారి ఎన్నికల్లోనూ ప్రజలంతా తనను ఆశీర్వదించాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో నాయకులు సుకుమారవర్మ, కోన బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, శివ పాల్గొన్నారు.

అనకాపల్లి అసెంబ్లీ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిల కో-ఆర్డినేటర్‌గా ప్రసాద్



రాంబిల్లి, ఏప్రిల్ 2 : అనకాపల్లి అసెంబ్లీ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిల కో-ఆర్డినేటర్‌గా రాంబిల్లి మండలం కృష్ణంపాలేనికి చెందిన న్యాయవాది కశిరెడ్డి ప్రసాద్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. ప్రస్తుతం ప్రసాద్ టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శిగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యం తాను పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.


ఇళ్ల వద్దే పింఛన్లు పంపిణీ చేయాలని వినతి



ఎంపీడీవో కార్యాలయంలో వినతి అందిస్తున్న దృశ్యం

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 2 : పింఛనర్లకు ఇళ్ల వద్దే పింఛన్ డబ్బులు పంపిణీ చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో సచివాలయ సిబ్బందితో పింఛన్‌లను పంపిణీ చేపట్టాలన్నారు. నాయకులు డి.అప్పారావు, సబ్బి శ్రీనివాసరావు, సూరిశెట్టి జగదీష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన ర్యాలీ



సర్వసిద్ధి లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎస్.రాయవరం, ఏప్రిల్ 2 : ఆటిజంపై మండలంలోని సర్వసిద్ధి గ్రామంలో మంగళవారం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి ఎస్.ఎస్. శక్తిప్రియ మాట్లాడుతూ ఆటిజం ఉన్నవారు ఎటువంటి లక్షణాలు కలిగి ఉంటారో వివరించారు. అంతేకాకుండా వీరు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది టి.నాగేశ్వరరావు, ఎం.రత్నసఖి, ఎస్ఎస్‌వీ ప్రకాశ్, వై.సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పేట' వైసీపీ అభ్యర్థి ప్రచారం

కోటవురట్ల, ఏప్రిల్ 2 : మండలంలోని కొడవటిపూడి, లింగాపురంలలో పాయకరావుపేట వైసీపీ అభ్యర్థి కంభాల జోగులు మంగళవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను చూసి ఓటువేసి గెలిపించాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, సాగి సీతబాబు (దత్తుడు), నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు, పైల రమేష్, కోరుప్రోలు రమణ, గోవింద్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో పన్నుల వసూళ్లు : జడ్సీ



అయ్యప్పనాయుడు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 2 : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో రికార్డుస్థాయిలో పన్నులు వసూలు చేసినట్టు జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇంటి పన్నులు మార్చి 31నాటికి రూ.12 కోట్లు లక్ష్యం కాగా రూ.తొమ్మిది కోట్ల 16 లక్షలు వసూలు చేశామన్నారు. ఒక్క మార్చి 31వ తేదీనే రూ.కోటి 28 లక్షలు పన్నులైనట్టు చెప్పారు. ఖాళీ స్థలాల పన్నులు లక్ష్యం రూ.రెండు కోట్ల 50 లక్షలు కాగా, రూ. కోటి 60 లక్షలు వచ్చిందన్నారు. కుళాయి పన్నులు రూ.4.8 కోట్లు వసూలు కావాల్సి ఉండగా, కేవలం రూ. 41లక్షలు మాత్రమే వసూలైనట్టు వివరించారు. కుళాయి పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ పెట్టి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

పాయకరావుపేట, ఏప్రిల్ 2 : పట్టణ శివార్లలో మంగళవారం ఇక్కడి పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించి సుమారు వెయ్యి లీటర్ల బెల్లం ఊటతో పాటు, సారా బట్టీని ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఈ దాడిచేసినట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

'భక్తిశ్రద్ధలతో వసంత నవరాత్రులు'

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 2 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో వసంత నవరాత్రి ఉత్సవాలను అంతా ఘనంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ డివిజనల్ కన్వీనర్ బీవీ రమణ సూచించారు. కొండకర్ల గ్రామంలోని రామాలయం వద్ద ఫౌండేషన్ ప్రతినిధులతో మంగళవారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఉగాది వేడుకలను అంతా ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్, డివిజన్ ప్రతినిధులు కొల్లి అప్పారావు, గుడివాడ రమణ, చోడపల్లి సత్యం, వరహాలమ్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి గుత్తుల శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం నుంచి పిరిడి భగత్, పాయకరావుపేట (ఎస్సీ) నియోజక వర్గం నుంచి బోని తాతారావు, అనకాపల్లి నియోజకవర్గం నుంచి ఇళ్ల రామ గంగాధరరావు, మాడుగుల నియోజకవర్గం నుంచి బీబీఎస్ శ్రీనివాసరావు, పాడేరు నియోజకవర్గం నుంచి సతక బుల్లిబాబు పోటీ చేయనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని మిగిలిన తొమ్మిది అసెంబ్లీ, మూడు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఈ నెల ఎనిమిదో తేదీన ఖరారు చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

నర్సీపట్నం
నియోజకవర్గం

అబద్ధాల జగన్‌రెడ్డిని ఇంటికి పంపుదాం : అయ్యన్న


జోగంపేట ప్రచార సభలో మాట్లాడుతున్న అయ్యన్న

గొలుగొండ, ఏప్రిల్ 2 : రాష్ట్రంలో సంపూర్ణంగా మద్య నిషేధం అమలు చేసిన తరువాతే ప్రజలకు ఓట్లు అడుగుతానని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి, ఇప్పుడు చేస్తున్నది ఏమిటని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. మండలంలోని జోగంపేటలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని గద్దె దించడమే అందరి లక్ష్యం కావాలన్నారు. చంద్రబాబు ఇటీవల ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి చూస్తే.. ఈ ఐదేళ్ల వైసీపీ పాలన ఇట్టే అర్థమవుతుందని ఎమ్మెల్యే గణేశ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అంతకు ముందు పలు కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరడంతో వారికి అయ్యన్న స్వాగతం పలికారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అడిగర్ల అప్పలనాయుడు, చిటికెల తారక వేణుగోపాల్, సుర్ల బాబ్జి, ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గెడ్డం నానాజీ, చిటికెల సాంబమూర్తి, కె.రవివరమ్మ, కొల్లి రాంబాబు, సత్యనారాయణ, గెడ్డం ఆనంద్, రాజాన వీరసూర్య చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పిల్లలకు నేస్తాలు వంటివి



పుస్తక ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మాకవరపాలెం, ఏప్రిల్ 2 : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో పిల్లల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము మాట్లాడుతూ పుస్తకాలు పిల్లలకు నేస్తాలు వంటిన్నారు. విద్యార్థులు సబ్జెక్టుతో పాటు కథల పుస్తకాలు, నీతిపుస్తకాలు, విలువులకు సంబంధించిన పుస్తకాలు చదవాలనే ఉద్దేశంతో 1976వ సంవత్సరం నుంచి అంతర్జాతీయ పిల్లల పుస్తక దినోత్సవాన్ని జరుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత వైసీపీ భూస్థాపితం

▸▸ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే ఆంధ్రలో అభివృద్ధి పరుగు ▸▸ మూడు పార్టీల కలయికతో తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు : సీఎం రమేశ్


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

నర్సీపట్నం, ఏప్రిల్ 2 : ఎన్నికల తర్వాత రాష్ట్రంలో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని అనకాపల్లి పార్లమెంటు స్థానానికి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ స్పష్టం చేశారు. మంగళవారం ఇక్కడి స్టార్ హోమ్స్‌లో మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి అయ్యన్నపాత్రుడు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా అయ్యన్నపాత్రుడు నాలుగు మండలాలు, మునిసిపాలిటీ నుంచి విచ్చేసిన టీడీపీ నాయకులను పరిచయం చేశారు. ఈ సందర్భంగా సీఎం రమేశ్ మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడుపై స్థానిక ఎమ్మెల్యే లేనిపోని అభాండాలు వేస్తున్నారన్నారు. పదిసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అయ్యన్నతో రెండుసార్లు పోటీ చేసిన ఎమ్మెల్యేకి పోలిక ఎక్కడని ఎద్దేవా చేశారు. అయ్యన్నపాత్రుడు ఒక బ్రాండ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడానికి రాష్ట్రంలో ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలిసిన తర్వాత తాడేపల్లి ప్యాలెస్‌లో వణుకు ప్రారంభం కాగా, వైసీపీ నాయకులు బిక్కుబిక్కుమని ఉంటున్నారని ఎద్దేవా చేశారు. పేదలకు, పెత్తందార్లకు మధ్య పోటీ జరుగుతుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అంటున్నారని, ముఖ్యమంత్రి కాక ముందే బెంగళూరులో ఒకటి, హైదరాబాద్‌లో ఒకటి అతిపెద్ద ప్యాలెస్‌లు పేదోడు అతడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో టీడీపీ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రగతి పరుగు తీస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. మాజీ మంత్రి అయ్యన్న మాట్లాడుతూ రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వాలు ఏర్పాటు కావాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు

బాల్య వివాహాల వల్ల అనర్థాలపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది

గొలుగొండ, ఏప్రిల్ 2 : బాల్య వివాహాల వల్ల అనర్థాలను వివరిస్తూ ఐసీడీఎస్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కృష్ణాదేవిపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ గొలుగొండ సెక్టార్ సీడీపీవో శ్రీగౌరి మాట్లాడుతూ పద్దెనిమిది సంవత్సరాలు నిండిన తరువాతే ఆడపిల్లకు వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా ఇటువంటి వివాహాలు చేయడం చట్టవిరుద్ధంగా పేర్కొన్నారు. అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ గాయిత్రి, ఏఎల్‌పురం అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీసత్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఉద్రిక్తత

... 5వ పేజీ తరువాయి

బయటకు పంపించేశారు.

వలంటీర్లు, ఇంటి యజమానిపై కేసు నమోదు

ఈ వ్యవహారంలో 15 మంది వలంటీర్లు, ఇంటి యజమానిపై కేసు నమోదు చేశామని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం తెలిపారు. వలంటీర్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహిస్తున్నారని జిల్లా కలెక్టర్‌కు అందిన ఫిర్యాదులో భాగంగా ఫ్లయింగ్‌స్క్వాడ్, అర్బన్ నోడల్ అధికారి తనిఖీ చేశారని, కొంతమంది వలంటీర్లు గోడదూకి వెళ్లిపోయారని వివరించారు. తాళం వేసి ఉన్న గదిలో తనిఖీ చేయడానికి యత్నించగా ఇంటి యజమాని తాళాలు లేవని చెప్పడంతో వాటిని పగలగొట్టి తలుపు తెరిచి చూడగా అందులో 15 మంది వలంటీర్లు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో తొమ్మిది మంది మహిళా వలంటీర్లు, ఆరుగురు పురుష వలంటీర్లు, ఇంటి యజమానిపై కేసు నమోదు చేశామని వివరించారు.


రోడ్డు మీద బైఠాయించిన టీడీపీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ తొలి జాబితా విడుదల

... 5వ పేజీ తరువాయి

ఉన్నాయి. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి గుత్తుల శ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గం నుంచి పిరిడి భగత్, పాయకరావుపేట (ఎస్సీ) నియోజక వర్గం నుంచి బోని తాతారావు, అనకాపల్లి నియోజకవర్గం నుంచి ఇళ్ల రామ గంగాధరరావు, మాడుగుల నియోజకవర్గం నుంచి బీబీఎస్ శ్రీనివాసరావు, పాడేరు నియోజకవర్గం నుంచి సతిక బుల్లిబాబు పోటీ చేయనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని మిగిలిన తొమ్మిది అసెంబ్లీ, మూడు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఈ నెల ఎనిమిదో తేదీన ఖరారు చేయనున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ముసుగు తొలగింది

... 5వ పేజీ తరువాయి

ప్రచారంలో కీలకపాత్ర పోషించకూడదని అధికారులు హెచ్చరించడం లేదు. అలా చేస్తే ఏ ఉద్యోగాలు రావని కూడా చెప్పడం లేదు. వారు కూడా అధికార పార్టీకి అనుకూలంగానే వ్యవహరిస్తున్నారు.

ఇదీ అసలు కారణం?

కేంద్ర ఎన్నికల సంఘం మూడేళ్లకు పైబడిన అధికారులను ఆయా ప్రాంతాల నుంచి బదిలీ చేసినట్టే...గత నాలుగేళ్లుగా గ్రామాలు, వార్డుల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం కాకూడదని స్పష్టంచేసింది. ప్రతి నెలా వీరి ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలు, పెన్షన్లు ఇస్తున్నందున ఓటర్లు ప్రభావితం అయ్యే అవకాశం ఉందని, ఆ పనులు కూడా వారికి అప్పగించవద్దని ఆదేశించింది. ఏప్రిల్ ఒకటో నుంచి పింఛన్ల పంపిణీ బాధ్యతలు ఇవ్వవద్దని సూచించింది. దీనిని అధికార పార్టీ వైసీపీ జీర్ణించుకోలేకపోయింది. అసలు పింఛన్లు ఇవ్వడానికి నిధులు లేవనే విషయం దాచిపెట్టి, ప్రతిపక్ష పార్టీలు కుట్ర వల్లే ఇదంతా జరుగుతున్నదని దుష్ప్రచారం ప్రారంభించింది. పేదలు, వృద్ధులకు పింఛన్లు సకాలంలో ఇవ్వడం కష్టమేనని ప్రచారం ప్రారంభించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో బుధవారం నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీకి ఏర్పాట్లుచేసింది.

వలంటీర్ల రాజీ డ్రామా!

... 5వ పేజీ తరువాయి

చర్చనీయాంశమవుతుంది. కాగా సోమవారమే రాజీనామా చేసినట్టు ప్రకటించిన వలంటీర్లు మంగళవారం వాటిని మండల పరిషత్ కార్యాలయానికి పంపారు. ఈ విషయాన్ని మండల పరిషత్ ఏవో రాంబాబు వద్ద ప్రస్తావించగా రాజీనామా పత్రాలు మంగళవారమే తమ కార్యాలయానికి చేరాయని నిర్ధారించారు. పంచాయతీ కార్యదర్శి మహేష్‌ను వివరణ కోరగా తమ కార్యాలయానికి ఎవరూ రాజీనామా పత్రాలు అందజేయలేదన్నారు. ఇదిలావుండగా ఈ విషయాన్ని ఎంపీడీవో కీర్తి వద్ద ప్రస్తావించగా సోమవారమే వలంటీర్లు రాజీనామా పత్రాలు కార్యాలయానికి అందజేశారని చెప్పడం గమనార్హం. ఈ వ్యవహారంలో వైసీపీ నేతలకు అనుకూలంగా ఎంపీడీవో వ్యవహరించడం చర్చనీయాంశమవుతోంది.

చర్యలు తీసుకోవాలి

వలంటీర్లు రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేయకముందే ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు సమక్షంలో వైసీపీ అనుకూల నినాదాలు చేయడం ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించడమేనని తానాం సర్పంచ్ కన్నూరి దేవి మండిపడ్డారు. కోడ్‌ను బేఖాతరు చేసిన వలంటీర్లతో పాటు ఎమ్మెల్యే, జడ్పీటీసీ సభ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో నియోజకవర్గ ఆర్‌వోకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కొనసాగుతున్న రాజీనామాలు

పెందుర్తి: పెందుర్తి మండలంలో మంగళవారం మరో 16 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు ఎంపీడీవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇందులో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్వగ్రామమైన రాంపురంలో 14 మంది, గొరపల్లికి చెందిన ఇద్దరు వలంటీర్లు ఉన్నారు. సోమవారం గొరపల్లిలో 13 మంది, గత నెల 30న రాజయ్యపేటలో ఒకరు రాజీనామా చేశారు. దీంతో మండలంలో రాజీనామా చేసిన వలంటీర్ల సంఖ్య సుమారు 30 మందికి చేరింది.

కశింకోట మండలంలో 104 మంది

కశింకోట : కశింకోట మేజర్ పంచాయతీ నాలుగు సచివాలయాల పరిధిలో 89 మంది వలంటీర్లు మంగళవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మొత్తం 91 మంది ఉండగా వారిలో ఇద్దరు గతంలోనే రాజీనామా చేశారు. ఈ మేరకు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్లు, వేలిముద్ర పరికరాలను అందజేశారని పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. కశింకోట మండలం బయ్యవరం గ్రామానికి చెందిన 14 మంది వలంటీర్లు, విస్సన్నపేట గ్రామానికి చెందిన ఒక వలంటీరు మంగళవారం రాజీనామా చేశారని ఎంపీడీవో శేషుబాబు తెలిపారు. అనకాపల్లి జీవీఎంసీ 11వ వార్డు సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న శరగోపం వెంకట విజయ ఉద్యోగానికి రాజీనామా చేస్తూ లేఖ ఇచ్చినట్టు అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు మంగళవారం తెలిపారు.

చోడవరం
నియోజకవర్గం

పింఛన్లు ఇళ్లకు వెళ్లి ఇవ్వాలి

చోడవరం, ఏప్రిల్ 2: సంక్షేమ పింఛన్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందించాలని కోరుతూ టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నేతలు మంగళవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే అందించేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెదబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, నాయకులు ఏడువాక లక్ష్మణకుమార్, కొట్టాపు చిన్న పాల్గొన్నారు.

సిద్ధి వినాయక ప్లంబర్స్ ఎలక్ట్రిషియన్ల యూనియన్ అధ్యక్షుడిగా గంగాధర్



చోడవరం, ఏప్రిల్ 2: మండల సిద్ధి వినాయక ప్లంబర్స్ మరియు ఎలక్ట్రీషియన్ల సంఘం అధ్యక్షుడిగా గనిరెడ్డి కల్యాణ గంగాధర్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నమ్మిశ్రీను, కార్యదర్శిగా డి.శివకుమార్, సంయుక్త కార్యదర్శిగా కోన మధు, కోశాధికారిగా చొప్ప పెంటారావు, బోర్డు సభ్యులుగా మచ్చ గిరి, బి.మూర్తి, కరకాన అప్పారావు, బూరె నరసింహారావు, బత్తిన సంతోష్ నియమితులయ్యారు.

రెండు వేల లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

రావికమతం, ఏప్రిల్ 2: దొండపూడి గ్రామ శివారు తోటల్లో ఉంచిన 60 లీటర్ల నాటు సారాతో పాటు రెండు వేల లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేసినట్టు కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. ముందస్తు సమాచారంతో మంగళవారం ఉదయం దాడులు చేశామన్నారు. ఎనిమిది ప్లాస్టిక్ డ్రమ్‌లతో సారా తయారికి సిద్ధంగా ఉంచిన రెండు వేల లీటర్ల బెల్లం పులుసును గుర్తించామని, తమ రాకను గమనించి నిందుతులు పరారీ అయ్యారని ఆయన చెప్పారు.

మద్యం సీసాలు స్వాధీనం

చోడవరం: చీడికాడ రోడ్డులోని ఓ దుకాణంలో మంగళవారం ఆరు మద్యం సీసాలతో ఒకరిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ డి.శేఖరం తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం నిల్వ ఉంచిన సుంకర మహేష్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. అదే రోడ్డులో ఐటీఐ కాలేజీ సమీపంలో బంగారి దుర్గా ప్రసాద్ కూడా అక్రమంగా దాచి ఉంచిన 38 నాటు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసినట్టు చెప్పారు.

ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయండి

రోలుగుంట, ఏప్రిల్ 2: గ్రామ స్థాయిలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని మండల ఎన్నికల అధికారి అల్లు సూర్యనారాయణ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన వివిధ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ ఎన్ని శిలాఫలకాలు ఉన్నాయి?, ఎన్ని రాజకీయ నాయకుల విగ్రహాలు ఉన్నాయి? తదితర వివరాలను నివేదిక రూపంలో ఇవ్వాలని ఆదేశించారు. కోడ్ అమలుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలోని ఎక్కడా రాజకీయ నాయకుల పేర్లు బయటకు కనిపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో జాన్ లింకన్, వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కోసమే పోటీ

▸▸ బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

రావికమతం, ఏప్రిల్ 2: అన్ని రంగాల్లో వెనుకబడిన అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికే ప్రధానమంత్రి మోదీ తనను ఇక్కడ పోటీ చేయమన్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. స్థానిక తిరుమల కల్యాణ మండపం ఆవరణలో చోడవరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల బీజేపీ-జనసేన-టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో మంగళవారం రాత్రి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నుంచి అనకాపల్లి దూరమైనప్పటికీ ప్రధాని సూచనకు కట్టుబడి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాల్లోనూ చోడవరం పూర్తిగా వెనుకబడి ఉందన్నారు. ఇక్కడ రోడ్లు నరకానికి నకళ్లుగా ఉన్నాయన్నారు. జగన్ ప్రభుత్వం టీడీపీ, జనసేన కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులకు తగిన గుణపాఠం చెప్పే సమయం వచ్చిందన్నారు. చోడవరం ఎమ్మెల్యే డబ్బు సంపాదనే ధ్యేయంగా ప్రజల రక్తాన్ని జలగలా జుర్రేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం జగన్, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి అరాచకాలు తారస్థాయికి చేరాయన్నారు. జూన్ 4వ తేదీ తరువాత వీరంతా తిన్నది తిరిగి ప్రజలకు చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ జిల్లా అధ్యక్షులు డి.మహేశ్వరావు, బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, నియోజకవర్గ ఇన్‌చార్జులు బత్తుల తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.



సభకు హాజరైన నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు... మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 2: మండలంలో పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. దిబ్బిడి, వడ్డాది, బుచ్చెయ్యపేట, రాజాం గ్రామాల్లో పర్యటించి పోలింగ్ బూతుల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. కొత్తగా ఓటు కోసం దరఖాస్తు చేసుకునేలా యువతకు అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు పటిష్టంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సకల సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో టి.ఎస్.వెంకటాచార్యులను ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో చిన్నికృష్ణ, ఎస్‌ఐ డి.ఈశ్వరరావు ఉన్నారు.


దిబ్బిడిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పోలీస్ చెక్‌పోస్టు పరిశీలన

మాడుగుల రూరల్: మండలంలోని తాటిపర్తి వద్ద పోలీసు చెక్‌పోస్టును మంగళవారం జిల్లా కలెక్టర్ రవిపట్టన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాలకు ముఖ ద్వారమైన తాటిపర్తి వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు పరిస్థితిని పరిశీలించారు. కరెన్సీ, మద్యం, గంజాయి ఇతరత్రా రవాణాపై ప్రత్యేక దృష్టిసారించాలని ఈ సందర్భంగా సిబ్బందికి ఆదేశించారు. ఈఆర్వో సత్యవాణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో కాళీప్రసాద్, ఎన్నికల డీటీ రాజా, ఎస్‌ఐ దామోదరనాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేయాలని నిరసన


జడ్.జోగుంపేటలో పోలింగ్ బూత్ కావాలని నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

రావికమతం, ఏప్రిల్ 2: జడ్.జోగుంపేట గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని ఏడు ఆదివాసీ గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జడ్.జోగుంపేటలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ చీమలపాడు పంచాయతీ పరిధిలో 19 గిరిజన శివారు గ్రామాల్లో ఓటర్లు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న చీమలపాడు, ములకాలపల్లి బూత్‌లకు కాలినడకన వెళ్లి ఓటు వేయాల్సి వస్తున్నదన్నారు. దీంతో ప్రతీ ఎన్నికల సమయంలో కొండలు దిగి కాలినడకన రాలేక ఓటు హక్కును వినియోగించుకోలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడు కిలోమీటర్ల దూరంలో పాఠశాల భవనం, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదిర సదుపాయాలు ఉన్న జడ్.జోగుంపేటలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేస్తే ఈ బాధలు తప్పుతాయని పేర్కొన్నారు. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని ఏడు గ్రామాల ఆదివాసీ ఓటర్లు విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

▸▸ మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు


ప్రజలకు సూపర్-6 పథకాలు వివరిస్తున్న పైలా

కె.కోటపాడు, ఏప్రిల్ 2: మాడుగుల నియోజకవర్గం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి పైలా ప్రసాదరావు చెప్పారు. మండలంలోని మేడిచర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజాగళం-ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. టీడీపీ శ్రేణులతో కలిసి పైలా ఇంటింటికీ వెళ్లి బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్-6 పథకాల గురించి వివరించారు. ఒక్కసారి తనకు అవకాశమిస్తే ప్రగతి బాట పట్టించి మాడుగులను ముందుకు నడిపిస్తానన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అదోగతి పాలైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలు అధ్యక్షులు రొంగలి మేష్, మాజీ ఎంపీపీ సబ్బవరపు రామునాయుడు, సర్పంచ్ పూడి నారాయణమూర్తి, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బాలిబోయిన సంతోష్, మండల బీజేపీ అధ్యక్షులు కొటాన ఈశ్వరరావు, అనకాపల్లి జిల్లా పార్లమెంటరీ టీడీపీ యూత్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పూడి శ్రీనివాసరావు, ఎ. కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, స్థానిక నాయకులు ఆదిరెడ్డి నరసింహమూర్తి, బొడ్డు శ్రీనివాసరావు, బొడ్డు దేముడుబాబు, బొడ్డు శేషు, పూడి అప్పలనాయుడు, రొంగలి కుమార్, నాగిరెడిడ్డి శ్రీరామ్‌మూర్తి, నియోజకవర్గ జనసేన పార్టీ కన్వీనర్ రాయపురెడ్డి కృష్ణ, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ తదిరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

'బాల్య వివాహానికి సహకరించిన వారిపై కేసులు పెడతాం'

చీడికాడ, ఏప్రిల్ 2: బాలిక వివాహానికి సహకరించిన అందరిపైనా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని జిల్లా బాలల సంరక్షణ అధికారి డి.లోవరాజు హెచ్చరించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక, అదే గ్రామంలోని హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతుంది. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో బాలికను ఇచ్చి వివాహం చేయడానికి ఇరు కుటుంబాల వారు నిశ్చయించారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు బాలిక ఇంటికి మంగళవారం వెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం జి.కొత్తపల్లి వెళ్లి అబ్బాయి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకవేళ ఎటువంటి పరిస్థితుల్లోనైనా వివాహం చేసినట్లయితే ఇరుగ్రామాలకు చెందిన వారి తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలపైన కేసులు నమోదుచేసి జైలుకి పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఏఎన్ఎం మౌనిక, మహిళ పోలీస్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల యుద్ధానికి సిద్ధం: డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ, ఏప్రిల్ 2: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం వైసీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గం అభివృద్ధి చేయడంతో సీఎం జగన్ తనను ఎంపీ అభ్యర్థిగాను, తన కుమార్తె అనూరాధను ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపిక చేశారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా విజయం సాధిస్తానన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ, ఎంపీపీ కురచా జయమ్మ, జడ్పీటీసీ లాలం శారదవరలక్ష్మి, మండల యూత్ అధ్యక్షులు గొల్లవిల్లి రాజబాబు, నాయకులు శ్రీరంరెడ్డి సూర్యనారాయణ, పుట్టా రామ్‌కుమార్, కొల్లి శ్రీను పాల్గొన్నారు.

వేసవి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు

చీడికాడ, ఏప్రిల్ 2: వేసవికాలంలో మంచినీటి ఎద్దడి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఉమామహేశ్వరి స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఉపాధి పథకం అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో ఎటువంటి నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో వైద్యంపె అప్రమత్తంగా ఉండి అవసరం మేరకు కూలీలు అందరికీ ఉపాధి కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ పర్యవేక్షకుడు ఎం.కామేశ్వరరావు, ఏపీవో సియ్యాద్రి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

దేవరాపల్లి, ఏప్రిల్ 2: మండలంలోని ఎన్.గజపతినగరంలో వైసీపీ కార్యకర్తలు 17 మంది మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదారావు సమక్షంలో మంగళవారం చేరారు. కె.త్రినాథ్, నారాయణరావు, జి.గోవింద, వర్ధన్, ఈశ్వరరావు ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అయితేనే యువతకు భవిష్యత్ ఉంటుందన్నారు.

ఇళ్ల చెంతకే పింఛన్

దేవరాపల్లి, ఏప్రిల్ 2: ఇళ్ల వద్దే పింఛన్ ఇచ్చేలా చూడాలని టీడీపీ మండల అధ్యక్షుడు సూర్యనారాయణ కోరారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సచివాలయ ఉద్యోగులుతో పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఆయన విన్నవించారు. ఈ మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు చల్లా నానాజీ, గొర్లె దేముళ్లు, వెంకన్నదొర, బండారు శ్రీరామమూర్తి ఉన్నారు.